# స్వాతంత్ర్యం ఖరీదు

"శ్రీపతి" - కలంపేరు - తన భార్యతో అన్నాడు; "లక్ష్మీ, స్త్రీల విమోచనం గురించి వరసగా వ్యాసాలు రాద్దామనుకుంటున్నాను. వాటిని నీ పేర పంపించి, పత్రికలో అచ్చేయిస్తాను, ఏం?"

"మీ పేరే పంపరాదూ?"

"ఇంకా నయం. ఇప్పటికీ నా కలం పేరు మా ఆఫీసులో కొందరికి తెలిసిపోయింది. మా బాస్‌కు తెలిస్తే ఉద్యోగం ఊడుతుంది."

"ఇంకో కలంపేరు పెట్టుకోండి."

"మగపేరుతో రాస్తే ఆడాళ్ల పత్రిక అచ్చెయ్యదు."

"ఆడపేరు పెట్టుకోండి."

"అందుకనేగదా నీ పేరు పెడతానంటున్నాను."

"నా పేరుతప్ప ఇంకో ఆడపేరు దొరకలేదా? నా పేరు అరువియ్యను."

"అది కాదే, వెర్రిమొహమా! ఎవరన్నా ఇంటర్‌వ్యూ చేస్తామని వస్తే? ఉత్తరాలు రాస్తే?"

"అదా సంగతి? మీ దారిన మీరు ఏదో గాలికి పారేస్తే ఆ తరువాత తిట్లూ, దీవనలూ రాస్తే?"

"నీ వరస ఏమీ బాగాలేదు. నేనైనా మీ ఆడవాళ్ల ఉద్ధరింపులేగదా చెబుతున్నాను? ఆడవాళ్ల స్వేచ్ఛకోసం లోకమంతా ఘోషిస్తుంటే నువు కాస్త సహకరించనంటావే! ఆడదానివికాదూ? సిగ్గులేదూ?"

"ఆ మాట అన్నారు గనక నా స్వాతంత్ర్యాన్ని అమ్ముకుంటాను. దానికి ఏమిస్తారు? అయిదు తులాల బంగారం నగలూ, మూడు పట్టుచీరలూ ఇస్తారా? టివి సెట్టు కొంటారా?"

"ఏమాశ్చర్యం నీ స్వాతంత్ర్యాన్ని అమ్ముకుంటావా?"

"జీతం డబ్బులకు మీ స్వాతంత్ర్యాన్ని అమ్ముకున్నట్టు మీరు ఎన్నిసార్లు అనలేదూ? పెట్టుబడిదారీలో ఎవరికీ స్వాతంత్ర్యం ఉండదని లక్షసార్లు అన్నారే, ఆడవాళ్ల స్వాతంత్ర్యానికి పెట్టుపడిదారీ అడ్డంరాదా?"

***ముద్రణ : యువ, జనవరి 1977***